క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశానికి 26న రాత పరీక్ష

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల(బాలుర)లో 6, 7, 8, 9వ తరగతిలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో 25వ తేదీలోగా గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు 26వ తేదీ ఉదయం 10 గంటలకు వెలుగొండలోని గురుకుల పాఠశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఈ నెల 25 నుంచి గ్రామ సభలు

కంభం: మండలంలోని 14 పంచాయతీల్లో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి తెలిపారు. 25వ తేదీన చిన్నకంభం, లింగాపురం, దర్గా, 26న లక్ష్మి కోట, రావిపాడు, తురిమెళ్ల, 27న జంగంగుంట్ల, యర్రబాలెం, 28న నర్సిరెడ్డిపల్లి, పెద్దనల్లకాల్వ, హజరత్ గూడెం, ఔరంగబాదు, కందులాపురం, 29న కంభంలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సభకు ముందు ఆయా గ్రామాల్లో ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కోతకు గురైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



కోతకు గురైన చప్టాల వద్ద మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్

కొనకనమిట్ల: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఆ రోడ్డులో తారు రోడ్డు మొత్తం కంకర లేచి అడుగుకో గుంత ఏర్పడింది. చప్టాల వద్ద రహదారి భారీగా కోతకు గురైంది. దీనిపై ఇటీవల ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి స్పందించిన గనివానిపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు తన సొంత నిధులు రూ.9 వేలు ఖర్చు చేసి కోతకు గురైన చప్టాల వద్ద మరమ్మతులు చేపట్టారు. పొక్లెయిన్‌తో రోడ్డు బాగు చేసి గుంతలు పూడ్చించారు. కోతకు గురైన రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన గనివానిపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లును పలువురు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కురిచేడు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల లో ఖాళీగా వున్న సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 24వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కె. ఆరోను బాబు తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 26 న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన గొర్రాలి కొండ తిరుమల నాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శనివారం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవుని శాంతి కళ్యాణం



కళ్యాణం అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు



కళ్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి శాంతి కళ్యాణాన్ని అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.కేశవరావు, ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

లలిత సహస్రనామ కోటి కుంకుమార్చన ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఉభయదాతలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన పూజలు శనివారం రాత్రి ప్రారంభించారు. సామూహిక లలితా సహస్రనామ కోటి కుంకుమార్చన పూజలు మండల కాలం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉభయదాతలు పైడిమర్రి తిరుపాలు, శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు, కృష్ణ వారి దంపతులు ముందుగా అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం కుంకుమార్చన పూజలు చేశారు. దేవాలయ వృద్ధి, గ్రామాభివృద్ధితోపాటు లోక కళ్యాణం కోసం కోటి కుంకుమార్చన పూజలు మండల కాలం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ప్రధాన సలహాదారులు మురళీ కృష్ణమాచార్యులు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రావణి వెంకటేశ్వర్లు, యక్కలి శేషగిరిరావు, మేడా నరసింహారావు, పి.భాస్కర్, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు దర్మకర్తలు అల్పాహారం అందజేశారు.

పంట సాగుపై రైతులకు శిక్షణ తరగతులు



రైతులకు కరదీపికలు అందిస్తున్న అధికారులు

కంభం: కంభం–1 రైతు భరోసా కేంద్రంలో శనివారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్లో సాగు చేసే ప్రధాన పంటల్లో అధిక దిగుబడి సాధించడంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటిని అధిగమించేందుకు రైతులు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏడీఏ డి.బాలాజి నాయక్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖలో 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట పైరును పూత దశలో కలియదున్నినతే నేలలో సేంద్రియ కర్బనం పెరిగి నేల సారవంతంగా మారుతుందని తద్వార పంట దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రధాన పంటల్లో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులను వివరించే కరదీపికలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు వ్యవసాయాధికారిణి ఎ.శైలజ, ఉద్యానవన శాఖ అధికారిణి డి.శ్వేత, మండల వ్యవసాయాధికారిణి డి.స్వరూప, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూమి సారవంతం



రైతులకు కరదీపికలు పంపిణీ చేస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

అర్ధవీడు(బేస్తవారిపేట): పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై ఇస్తున్నట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బాలాజీనాయక్ పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో ఫార్మర్ ఓరియంటెడ్ యాక్టివిటీలో భాగంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేసి పూత దశలో భూమిలో కలియదున్నడంతో నేల సారవంతం అవుతుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలోని వీఏఏలను సంప్రదించాలని కోరారు. జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులు వాడకం, పంటలను ఆశించే పురుగులు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మేలైన యాజమాన్య పద్ధతుల కరదీపికలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మహమ్మద్, జిల్లా వనరుల కేంద్రం ఏఓ ఎ.శైలజరాణి, ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్ యూత్ సభ్యులు

తర్లుపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో ముసుగు తొలగించి క్షీరాభిషేకం చేశారు. గజమాల వేసి నివాళులర్పించారు. జై జగన్.. జోహార్ వైఎస్సార్.. జగనన్న వెంటే నడుస్తాం ... మళ్లీ సీఎంగా గెలిపించుకుంటాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఈర్ల చిన్న ఆంజనేయులు, భీమనబోయిన యోగిరాములు, బి మల్లిఖార్జున, కొండేబోయిన శివ, కల్లు అశోక్, గోగు వంశి, వన్నెబోయిన శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పెద్ద మల్లయ్య, ఆకుల పీరా, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

దొనకొండ: స్థానిక సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ అంతరాయం జరుగుతుందని ఏఈ షేక్ నాగూర్‌వలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గ్రామాల్లోని ప్రజలు గమనించి విద్యుత్ సిబ్బందిని సహకరించాలని కోరారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పొదిలి: మాదక ద్రవ్యాల వాడకంతో జీవితాలు ఛిద్రమవుతాయని సీఐ మల్లికార్జునరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్‌కు ఎలా బానిసలు అవుతున్నారు, వారి జీవితాలు ఎలా నాశనం చేసుకుంటున్నారో గమనించి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల రవాణా, వాడకం నేరమన్నారు. వాటి ఊబిలోకి వెళితే జీవితం ముగిసినట్లేనన్నారు. మాదక ద్రవ్యాల సమాచారం తెలిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఇంటర్‌మీడియట్ స్థాయి విద్య లక్ష్య సాధనకు తోడ్పాటు అందిస్తుందన్నారు. లక్ష్య సాధన కోసం విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. చెడు నడత కలిగిన వారికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కోటయ్య, ప్రిన్సిపాల్ తారావాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కొమరోలులో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

కొమరోలు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లుగా ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. మండల కేంద్రమైన కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ‘నేను బడికి పోతా’కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు, బడిలో అనే నినాదంతో ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయని, కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు



వెలుగొండలో భక్తులకు దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మండలంలోని వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మి అలివేలుమంగ వెలుగొండ వెంకటేశ్వరస్వామి వారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రామదూత క్షేత్రంలో నందీశ్వరునికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొనకనమిట్ల: కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం నందీశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు అకలంకం వెంకటరామ కృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా నందీశ్వరుని విగ్రహదాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచి వర్షాలు కురిసి పాడి పంటలతో అందరూ సుభిక్షింగా ఉండాలని దీవించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉభయదాతలను ప్రత్యేకంగా సన్మానించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్



హెడ్‌కానిస్టేబుల్ రమేష్‌ను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హిందూ పాఠశాలలో డాన్ టు డస్క్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిరువ్యాపారులకు కూరగాయల బండ్లు, గొడుగులు పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బాక్సులు అందజేశారు. ముఖ్య అతిథులుగా కేసీజీఎఫ్ కె.వెంకట సురేష్‌బాబు, వాసవీ సత్రం సభ్యులు పి.జనార్దన్, స్థానిక పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, ఏపీజీబీ మేనేజర్ రామకృష్ణ, ఏపీఎం పిచ్చయ్య, వాసవీక్లబ్ నాయకులు కె.రత్తమ్మ, కృష్ణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లూరయ్య, నజీర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అతిథులను వాసవీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

నేడు పూలసుబ్బయ్య 37వ వర్ధంతి సభ

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టు ఉద్యమ నేత, సీపీఐ నాయకుడు దివంగత పూలసుబ్బయ్య 37వ వర్ధంతి సభ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక పూలసుబ్బయ్య శాంతి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఖాశీం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సీపీఐ కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, జిల్లా సీపీఐ కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, పూలసుబ్బయ్య కుటుంబ సభ్యులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు, పూలసుబ్బయ్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

